స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి : పట్టణంలోని బాలుర గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ మాస్టర్లు ఎస్ కె. అజారుద్దీన్, సుబ్రమణ్యం, ధనుష్ లు పాఠశాల విద్యార్థులకు స్నేహం యొక్క గొప్పదనం గురించి తెలియజేశారు. అనంతరం ఫ్రెండ్ షిప్ బ్యాండ్స్ కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై కాంగ్రెస్ నాయకులు హర్షం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఏఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్టే విధించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, సంబరాలు జరుపుకున్నారు. రాహుల్ గాంధీపై గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు స్టే విధించడం జరిగింది. అంతేకాకుండా వెంటనే కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశాల ఇచ్చింది. దీనిని పురస్కరించుకొని శ్రీకాళహస్తినియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నందు రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్. ఎస్. బత్తైయ్య నాయుడు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసు నందు టపాకాయలు కాల్చి హర్షద్వనాలు మధ్య మిఠాయిలు పంచుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జానీ భాష, విజయ్ శేఖర్, వెంకట ముని, రాఘవరెడ్డి, గోపి, శివయ్య, నాగువయ్యా, రమణయ్య, మోహన్, సురేష్, బాలాజీ, వానమ్మ, మస్తానమ్మ, బానమ్మ, మస్తానమ్మా, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-వాకాడు: నెల 10 వ తేదీన నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిజెపి గూడూరు నియోజకవర్గం కన్వీనర్ వాకాడు మండల మాజీ వైస్ ఎంపిపి పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి అన్నారు,ఆదివారం ఆయన మీడియా తో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు మంజూరు చేస్తున్న నిధులను రాష్ట్రంలో ఉన్న వైకాపా పార్టీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులను మంజూరు చేయకుండా పంచాయతీలను నిర్వీరామం చేస్తున్నందుకు నిరసనగా రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆదేశాలు మేరకు ఈనెల 10వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా బిజెపి ఆధ్వర్యంలో కలెక్టరేట్లు ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు,పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను విడుదల చేయకుండా ఇతర పనులకు ఆ నిధులను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైకాపా పార్టీ మద్దతుదారుల సర్పంచ్ నిధులు మంజూరు కాకపోవడంతో ఆత్మహత్యాకి పాల్పడిన సంఘటన జరగడం విచారకరమన్నారు ఇటువంటి పరిస్థితుల్లో బిజెపి చేస్తున్న న్యాయపోరాటానికి అందరూ సర్పంచులు మద్దతు ఇవ్వాల్సిందిగా పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి కోరారు తిరుపతి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి బిజెపి నాయకుడు కిరణ్ కుమార్ రెడ్డి సారధ్యము వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనది డిసెంబర్ తరువాత ఎప్పుడైనా రాష్ట్రంలో ఎన్నికలలో జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు రాష్ట్రంలో బిజెపి రోజు రోజుకు బలపడుతున్నదన్నారు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ అధ్యక్షురాలు పర్యటిస్తారని ప్రజా సమస్యలపై ఉద్యమాలు తప్పవని తెలిపారు.కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పురుషోత్తమ రెడ్డి పంచాయతీల సర్పంచ్లకు మరోసారి విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టులకు అన్నివిధాలుగా అండగా ఉంటాం

చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెల్లడి

విశాలాంధ్ర - తిరుపతి: జర్నలిస్టులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ సభ్యులు వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో ఆదివారం మెగా హెల్త్ చెకప్ ఫ్రీ మెడికల్ క్యాంపును నిర్వహించారు. గుండె, రక్త సంబంధిత (రూ. 2,950 ఖరీదైన 42 రకాల) పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మెగా హెల్త్ చెకప్ కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ ప్రజలతోపాటు జర్నలిస్టులంతా కూడా తనకు కుటుంబ సభ్యులేనని అన్నారు. ఖరీదైన వైద్య పరీక్షలను ఖచ్చితమైన ఫలితాలు వచ్చే ఆధునిక వైద్య పరికరాలతో హెల్త్ చెకప్పును నిర్వహించామన్నారు. ప్రెస్ క్లబ్ కు సొంత భవనం లేదని, ప్రస్తుత ప్రెస్ క్లబ్ రెనివేషన్ అవసరమని కమిటీ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, బాలచంద్ర కోరారు. దీనిపై స్పందించిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రస్తుత ప్రెస్ క్లబ్ ఆధునికరణకు ఖర్చుకు వెనుకాడకుండా అత్యాధునికంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. 30 ఏళ్ల చరిత్ర కలిగిన తిరుపతి ప్రెస్ క్లబ్ కు సొంత భవనం లేకపోవడం అన్యాయమన్నారు. సొంత స్థలం సమకూర్చేందుకు సంపూర్ణ సహకారం అందిస్తానని, ప్రెస్ క్లబ్ సొంత భవన నిర్మాణానికి తన ట్రస్ట్ నుంచి రూ. పదిలక్షల నిధిని అందిస్తానని ప్రకటించారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టులు ముందుకు వస్తే మండలానికో ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బ్లడ్ రిపోర్ట్స్ రెండు రోజుల్లో వస్తుందని, దీనిపై వచ్చే ఆదివారం ప్రముఖ వైద్యులతో మెగా మెడికల్ క్యాంపును నిర్వహిస్తామని చెప్పారు. మెడికల్ క్యాంపు సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు వారి కుటుంబ సభ్యులకు ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజన సదుపాయాలను సమకూర్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్ రెడ్డి లను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి బాలచంద్ర, ఉపాధ్యక్షులు విక్రమ్, జాయింట్ సెక్రటరీ ద్వారకానాథ్, దినేష్, ఈసీ మెంబర్స్ మహేష్, వరప్రసాద్, లావణ్య కుమార్, సంజీవి సునీల్, సీనియర్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ

విశాలాంధ్ర - తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలంలోని పాతకాల్వ గ్రామంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఉదయం ద్రౌపదీ, సమేత ధర్మరాజుల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో కురుక్షేత్రం యుద్ధంలో తన సోదరులైన కౌరవులను పోగొట్టుకున్న దుర్యోధనుడు నీటి మడుగులో దాక్కొని పరమేశ్వరున్ని ప్రార్థిస్తుంటాడు.అతన్ని మడుగులో నుంచి భీముడు బయటికి తీసుకొచ్చి వధించే ఘట్టాన్ని కళాకారులు కళ్లకుకట్టినట్టు నటించి ప్రేక్షకులను అలరించారు.దుర్యోధనుడుగా మునికృష్ణ,భీముడుగా పీలేరు శంకర తమ నటనా ప్రతిభతో ఆకట్టుకున్నారు.పరిసర గ్రామాల నుంచి ప్రేక్షకులు పెద్ద ఎత్తున విచ్చేసి దుర్యోధన వధ నాటకాన్ని వీక్షించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చిన్నబ్బ ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణంరెడ్డి, ముని, రోశిరెడ్డి, పూజారి నాగరాజు, కైలాశ్, రాజేష్, వెంకటముని, శివానంద, మోహన్రెడ్డి, వజ్రం గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ బాధితులకు సంఘీభావ ర్యాలీ

విశాలాంధ్ర - గూడూరు : మణిపూర్ లో జరిగిన హింసాత్మక ఘటనలో వందలాది కుటుంబాలు విచ్ఛిన్నమైపోయాయని వారికి సంఘీభావంగా శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నామని గూడూరు ఎస్ఏఎల్సీ చర్చ్ పాస్టర్ ఓడిజే ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. ఈ ర్యాలీ గూడూరు కూరగాయల మార్కెట్, హాస్పిటల్ రోడ్ ,రాజా వీధి పాత బస్టాండ్ మీదుగా సాగింది. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏఎల్సీ చర్చి సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను

విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో
దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను.
ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.

పనిచేయవలసిన మండలాలు :

తిరుపతి సిటీ, డక్కిలి, ఏర్పేడు, తడ, డి.వి.సత్రం, నారాయణవనం,
వడమాలపేట, నగరి, పెనుమూరు, ఎస్.ఆర్.పురం, పూతలపట్టు, తవణంపల్లి,
యాదమరి, చిత్తూరు రూరల్, శాంతిపురం

గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి

సంప్రదించవలసిన నెంబరు: 94909 52134

ఆలయ అభివృద్ధి పనులు బేష్ -పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటా

-డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

విశాలాంధ్ర - కార్వేటినగరం: శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయ అభివృద్ధి పనులు బేషని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని స్కంధపుష్కరిణీ సమీపంలో కుమార గిరిపై వెలసి ఉన్న వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి ఆలయ అభివృద్ధి పనులను సందర్శించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆలయ అధ్యక్షుడిగా కేశవ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి పనులు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. కార్వేటినగరం చారిత్రాత్మ కట్టడాలకు నిలయమని, అలాగే ఆలయాలకు కూడా నిలయమన్నారు. తాను పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడానికి ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించానని, అందుకే కార్వేటినగరంలో వెలసి ఉన్న శ్రీసుబ్రమణ్యం స్వామి ఆలయ అభివృద్ధికి మ్యాచింగ్ గ్రాంట్ లేకుండా నిధులు మంజూరు చేసి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చి తన రుణాన్ని తీర్చుకున్నాని తెలిపారు. అలాగే నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టి కనిగిరి కొండ. వరదవెంకటేశ్వరస్వామి ఆలయం లయాలకు, స్కంధపుష్కరిణిలో నీరాలిమండపం. అదే విధంగా వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఉన్న టీటీడీ కళ్యాణ మండపంలో అదనపు గదులు మంజూరు చేయడంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చొరవ ఉందని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎండోమెంట్ ద్వారా గోవర్ధనేశ్వర ఆలయం, ఆగ స్తీశ్వరస్వామి ఆలయం. అభిమాని గంగమ్మ ఆలయం పలు ఆలయాలను యల్లంపల్లి శ్రీనివాసులు చొరవతో పునర్నిమాణలు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, గ్రామాల్లో కూడా 75 ఆలయాలను నిర్మాణం చేపట్టడానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ శేఖర్ రాజు, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, డాక్టర్ దీపక్ రెడ్డి , మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయాదవు, నాలుగు మండలాల మండల కన్వీనర్లు, ఎండోమెంట్ ఈవో క్రిష్ణనాయక్. పయణిరెడ్డి, వెంకటరత్నం, శేషప్రకాష్ మొదలి శోభన్బాబు, శ్రీనివాసులురెడ్డి పలువురు పాల్గొనారు.

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం

పేదలకు హామీ... ఉపాధి హామీ ఉపాధితో.. ఊతం

పేదరికం నిర్మూలన దిశగా.. ఉపాధి హామీ పథకం అమలు -ప్రతి కూలికి గిట్టుబాటు వేతనం
కుటుంబాలలో వెలుగులు నింపుతూ.. పేదలకు వరం.. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం
జిల్లాలో గణనీయంగా పెరుగుతున్న కూలీల సంఖ్య -ప్రతి ఒక్కరికి 100 రోజుల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా ..
2023-24 ఆర్థిక సంవత్సరంలో భాగంగా 63 లక్షల పని దినాలు

విశాలాంధ్ర - తిరుపతి:సరైన ఉపాధి లేక.. బ్రతుకు తెరువు కోసం ఉన్నఊరిని, కన్న వారిని వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం జరుగుతుంది. వలసల నివారణ దిశగా.. గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన భద్రతను పెంచడానికి వారి సొంత గ్రామంలోని కూలీలు వ్యవసాయంతో పాటు ఉపాధి పనులు చేసుకుని జీవనం సాగించేలా 100 రోజుల పని దినములతో ఉపాధి కల్పన దిశగా.. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం తీసుకురావడం జరిగింది. బీడు భూమిని సాగులోనికి తీసుకొచ్చేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా అవకాశం కల్పించి రైతులను ఆదుకుంటుంది. ఉపాధి హామీ పథకం ద్వారా రికార్డు స్థాయిలో.. గ్రామీణ పేదలకు పనులు కల్పించే దిశగా.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాలను, వైయస్సార్ హెల్త్ క్లినిక్ ను, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను, అంగన్ వాడి సెంటర్ల నిర్మాణాలను, జగనన్న ఇళ్ళ నిర్మాణం వంటి పనులను ఉపాధి హామీ పథకంలో భాగంగా చేసి పూర్తి చేసేల చర్యలు చేపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కరోనా కష్టకాలంలో కూడా కూలీలకు బాసటగా నిలిచి ఉపాధి పనులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. రైతుల వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే నీటి సంరక్షణ, చెరువుల పూడిక తీత, హార్టికల్చర్ ప్లాంటేషన్, నీటి వనరుల వంటి అభివృద్ధి కార్యక్రమాలను ఉపాధి హామీ పథకం కింద చేపట్టడం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్న పేద కూలీలకు 100 రోజుల పని దినాల కార్యక్రమంలో భాగంగా వారి స్వంత గ్రామాలలోనే వారికి ఉపాధిని కల్పిస్తూ.. గ్రామీణాభివృద్ధి పనులు అయినటువంటి సిమెంటు రోడ్డు నిర్మాణం, పంట కాలువలు, నీటి గుంటలు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, పండ్ల మొక్కలు నాటించడం వంటి నిర్మాణాలలో వారు భాగస్వాములయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. గ్రామీణ ప్రాంతాలలో ఉన్నత చదువులు చదివి ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు కొనసాగించలేని యువతి యువకులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా వారి సొంత గ్రామంలోనే ఉపాధి కల్పించడం వలన ఉపాధి కోసం ఇతర నగరాలకు పనుల కోసం వెళ్లే వాళ్ళ సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది. సొంత గ్రామాలలోని ఉపాధి పొందుతూ వారి జీవన ప్రమాణాలను పెంచుకుంటున్నారు. తిరుపతి జిల్లాలో అమలవుతున్న మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ..రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవనోపాధి భద్రతకు భరోసా ఇచ్చేలా ఉపాధి హామీ పథక%శీ%ను అమలు చేస్తుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 2,71493 మంది కుటుంబాలకు జాబ్ కార్డులు ఇవ్వగా అందులో 1,53,000 కుటుంబాలకు పని కల్పించి 63 లక్షల పని దినాలను చూపించి 207.34 కోట్లు రూపాయలు ఖర్చు చేయగా అందులో 163.42 కోట్లు వేతన రూపంలో చెల్లించడం జరిగింది.సొంత గ్రామంలోనే ఉపాధి పనులు నాపేరు భాస్కర మాది కల్లూరు కండ్రిక గ్రామం, దొరవారి సత్రం మండలం. మా గ్రామంలో పనులు లేక ఉపాధి కోసం పక్క గ్రామాలకు వెళ్ళే వాళ్ళము. వచ్చిన డబ్బులు ఇంటి ఖర్చులకు సరిపోయేది కాదు. ఈ కూలి పనులు కూడా రోజు ఉండవు. అలాంటి కష్ట సమయంలో ఉపాధి పని గురించి తెలుసుకొని దరఖాస్తు చేసుకోవడం జరిగింది. వేరే గ్రామాలకు కూలిపనుల కోసం వెళ్లనవసరం లేకుండా ఇప్పుడు ప్రతిరోజు మా సొంత గ్రామంలోని కూలి పనులకు పోవడం జరుగుతున్నది. ప్రతి నెల క్రమం తప్పకుండా ఉపాధి డబ్బులు నా అకౌంట్ లో అధికారులు జమ చేస్తున్నారు. ఈ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి పొందడమే కాకుండా మా గ్రామం కూడా అభివృద్ధి చెందుతుంది చాలా సంతోషంగా ఉంది. పనుల కోసం వేరే గ్రామాలకు వెళ్లే అవసరం లేకుండా మా సొంత గ్రామంలోని ఉపాధి పనులను చేసుకునే అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ఎప్పుడు రుణపడి ఉంటాం.ఉపాధి హామీ పథకం వలన మా గ్రామం అభివృద్ధి చెందింది. నాపేరు శాంతి మాది కల్లూరు కండ్రిక గ్రామం దొరవారి సత్రం మండలం. గ్రామంలో కూలి పనులు లేక ఉపాధి కోసం నా భర్త తాపీ మేస్త్రి పని చేయడానికి చెన్నై కి వెళ్లడం జరిగేది. నేను పక్క గ్రామంలో కూలి పనుల కోసం వెళ్ళే దాన్ని నేను నా భర్త సంపాదించిన డబ్బులు పిల్లల చదువుకు ఇంటి ఖర్చులకు సరిపోయేది కాదు. నేను ఉపాధి పని గురించి తెలుసుకొని మా గ్రామంలోని ఉపాధి కార్యాలయంకు వెళ్లి దరఖాస్తు చేసుకున్న వారానికే నాకు పని ఇప్పించారు. ఇప్పుడు నా భర్త నేను ఊరిలోనే ఉపాధి పనికి వెళ్లడం జరుగుతోంది. ప్రతి నెల క్రమం తప్పకుండా మాకు ఉపాధి పనుల డబ్బులు నా అకౌంట్లో జమ చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం వలన మా గ్రామం కూడా అభివృద్ధి చెందినది. ప్రభుత్వం నిర్మాణాలలో కూడా ఉపాధి.నాపేరు నీలమ్మ మాది కల్లూరు కండ్రిక గ్రామం, దొరవారిసత్రం మండలం. మా కుటుంబము కూలి పనుల మీదే ఆధారడి బ్రతుకుతున్నాము. ఆ కూలీ పనులు కూడా ఊర్లో రోజు ఉండవు. ఈ కూలి డబ్బులే మా కుటుంబానికి ఆధారం కనుక పనులు ఎలా అని ఆలోచిస్తున్న తరుణంలో ఉపాధి హామీ అధికారులు పథకం గురించి మాకు తెలియజేసి దరఖాస్తు చేసుకునేలా మాకు సహాయం చేశారు. ఇప్పుడు రోజు వారి కూలి పనులే కాకుండా జగనన్న కాలనీల నిర్మాణం, ప్రభుత్వ భవనాలు నిర్మాణాలలో మాకు పని కల్పించారు. ఉపాధి హామీ పథకంకు సంబంధించి నాకు జాబ్ కార్డ్ కూడా అధికారులు ఇచ్చారు.జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు.ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా వారి సొంత గ్రామంలోని ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నాము. పంచాయతీ నందు జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు కలిపిస్తూ వారి జీవన ప్రమాణాలను పెంపొందించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది. జాబ్ కార్డు లేని వారికి జాబ్ కార్డులు మంజూరు అయ్యేలా చూస్తున్నాము. తిరుపతి జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించడంతోపాటు 100 రోజులు పని దినాలను కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కావున ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

వినియోగదారుల రాష్ట్రీయ సదస్సులో జ్ఞాపికను అందుకున్న అవార్డు రవి

విశాలాంధ్ర - ఐరాల : ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల రాష్ట్రీయ సదస్సు 6 వ తేదీ ఆదివారం విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం లో జరిగిన కార్యక్రమంలో వినియోగదారుల హక్కులు మరియు వినియోగదారులను చైతన్య పరచడం గురించి వివిధ రంగాలలో పనిచేస్తున్న అధికారుల ద్వారా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాపోచైర్మన్ నాగేశ్వరావు , చిత్తూరు జిల్లా కార్యదర్శి చిట్టిబాబు,సి.సి.సి చైర్మన్ డా. రామారావు,అవార్డు రవి, వివిధ స్వచంద్ద సంస్థ సభ్యులు పాల్గొన్నారు. క్యాపో తో కలిసి పనిచేస్తున్న స్వచంద్ద సంస్థలకు జ్ఞాపికలను అందజేశారు.

పుంగనూరు ఘటన చంద్రబాబు పక్కా ప్లాన్

సరుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆరోపణ

విశాలాంధ్ర- సత్యవేడు:టిడిపి జాతీయ అధ్యక్షుడు,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పక్క ప్లాన్ తోనే పుంగనూరులో టిడిపి నాయకులతో దాడికి తెగబడ్డారని సరుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆరోపించారు.పుంగనూరులో రెండు రోజుల క్రితం జరిగిన దాడిని నిరసిస్తూ సత్యవేడు మండలం దాసుకుప్పంలో ఆదివారం సాయంత్రం గ్రామస్తులతో కలిసి రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బాలాజీ రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఆదరణను చూసి చంద్రబాబు నాయుడుకు మతిభ్రమించిపోతోందని విమర్శించారు. ఎ ఇటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కూడా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముందు చంద్రబాబు ప్రభ తగ్గిపోతుండడంతో అసహనంతో పిచ్చి పట్టిన వాడిలా పుంగనూరులో టిడిపి నాయకులు ఉసిగొల్పి రణరంగం సృష్టించాడని ఆరోపించారు.చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నిన రాష్ట్ర ప్రజల నుంచి జగన్ను వేరు చేయలేరని స్పష్టం చేశారు.రాష్ట్రంలో అరాచకాలు సృష్టించి అధికారంలోకి రావాలనుకుంటున్న చంద్రబాబు కలలు సీఎం జగన్ ప్రజాబలం ముందు ఏమి చేయలేవని వ్యాఖ్యానించారు 2024 ఎన్నికల్లో ప్రజలు మళ్ళీ వైసీపీని గెలిపించి టిడిపిని భూస్థాపితం చేస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు భారీగా టీడీపీలో చేరిక
టీడీపీతోనే అభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం వైసీపీ నాయకులు 200 మందికి పైగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండల టిడిపి పార్టీ అధ్యక్షులు దువ్వూరు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పూడిరాయిదొరువు పంచాయతీ మాజీ సర్పంచ్ యల్లబోతు రాజగోపాల్ రెడ్డి అధ్యక్షతన 200 కి పైగా వైసీపీ కుటుంబాల వారు గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో టిడిపి కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ అరాచకాలకు ఆ పార్టీ నాయకులు విసిగిపోయి టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. పూడిరాయి దొరువు పంచాయతీ నుండి నలుగురు సభ్యులు, సీనియర్ నాయకులు టీడీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పంచాయతీలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 6 కోట్ల 30 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. మొనపాలెంలో 1 కోటి 74లక్షలతో తుఫాను షెల్టర్ నిర్మించామన్నారు. 41 లక్షలతో 11 సీసీ రోడ్లు, 10 లక్షలతో స్మశాన వాటిక నిర్మించామన్నారు. అయినా 2019 ఎలక్షన్లో ఈ పంచాయతీ నాకు తక్కువ ఓట్లు వేసి నన్ను ఓడించి ఒక్క ఛాన్స్ అన్న వైసీపీని గెలిపించారన్నారు. మీ నమ్మకాన్ని నేను ఒమ్ము చేయకుండా రేపు టిడిపి అధికారంలోకి రాగానే మన నాయకుడు చంద్రబాబు నాయుడు సహకారంతో మీ పంచాయతీలో సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య,పూడిరాయిదొరువు పంచాయతీ నాయకులు, మామిడి గోవిందయ్య,శమాజీ ఉపాధ్యక్షులు తంగా సుబ్బారెడ్డి, అయిల్ రెడ్డి, మీరాల్ రెడ్డి, తీపలపూడి రమణయ్య, చినిగి వెంకటేశ్వర్లు,శవార్డు మెంబర్లు జయమ్మ, మీనా,శనాగభూషణం, మంగమ్మ పాల్గొన్నారు.

పోలేరమ్మకు పుష్పాలతో ప్రత్యేక అలంకరణ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని రాణి పేట నాయుడు కాలువ కట్ట వద్ద ఆదివారం పోలేరమ్మ అమ్మవారి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో అమ్మవారికి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.. అమ్మవారికి పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ ఏర్పాటు చేశారు. భక్తులు పొంగళ్ళు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంబలి పంచిపెట్టారు. తప్పట్లు మేళాలకు చిన్నారుల డాన్సులు చేస్తూ సందడి చేశారు.

కష్టజీవుల గొంతు గద్దర్

విశాలాంధ్ర - తిరుపతి: ప్రజాయుద్ధ నౌకగా పేరుపొందిన గద్దర్ జననాట్యమండలి ద్వారా ఉద్యమాలకు బాసటగా నిలిచి ప్రజా చైతన్యానికి పునాదులు వేసిన గద్దం మరణం తెలుగు సాహితీ సాంస్కృతిక రంగాలకు తీరని లోటని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తిరుపతి జిల్లా శాఖ ప్రగాఢ సంతాపం తెలుపుతున్నది.ఐదు దశాబ్దాల కాలం సమ సమాజం కోసం, తన ఆటపాటతో ప్రభంజనం సృష్టించారని అరసం రాష్ట్ర నాయకులు సాకం నాగరాజ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం ప్రకటనలో పేర్కొన్నారు.

వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థినిలకు చేయూత

విశాలాంధ్ర-చిట్టమూరు: మండలంలోని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఎస్కే రహమ తుల్లా ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న ఇద్దరు విద్యార్థినిలకు నెల్లూరుకు చెందిన మహతి పెయింట్స్ మురుగేషన్ వారి సహకారంతో విద్యార్థినిలా చదువులకు పారితోషకం అందించడం జరిగింది. ఈ సందర్భంగా రహమతుల్లా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి చదువుకునే విద్యార్థిని, విద్యార్థులకు తమ సంస్థ ఆధ్వర్యంలో దాతల నుండి విరాళాలు సేకరించి వారిని ప్రోత్సహించడం జరుగుతుందని, ఈ సంవత్సరం నెల్లూరులోని మురుగేషన్ మహతి పెయింట్స్ వారి ద్వారా కౌశిక,యాస్మిన్ అనే ఒక్కొక్కరికి ఐదు వేల రూపాయలు చొప్పున ఇద్దరికీ పదివేల రూపాయలు అందజేయడం జరిగిందని రహంతుల్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ఆశ శ్రీనివాసులు,వి.వినోద్ రెడ్డి పలువురు కమిటీ సభ్యులు ఉన్నారు ఈ సందర్భంగా దాతలకు వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

మణిపూర్లో క్రైస్తవులకు అండగా నిలుద్దాం

విశాలాంధ్ర - రేణిగుంట : మణిపూర్లో ఇబ్బంది పడుతున్న క్రైస్తవులకు దేశం అంతా అండగా నిలబడాలని జీవాగ్రం సెయింట్ లూక్ లూథరన్ చర్చ్ పాస్టర్ కె.పి. లూథర్ బాబు పిలుపునిచ్చారు. గాజులమండ్యం పంచాయతీ జీవాగ్రం సెయింట్ లూక్ లూథరన్ చర్చ్ సభ్యులు ఆదివారం మణిపూర్ లోని క్రైస్తవులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా లూథర్ బాబు మాట్లాడుతూ మణిపూర్లో క్రైస్తవులపై క్రైస్తవ మందిరాలపై చేస్తున్న దాడులు చాలా దారుణమని అన్నారు. మణిపూర్లో క్రైస్తవులపై చేస్తున్న దాడుల వలన వారు ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతిన్నారని అన్నారు. వారికి మా వంతు సాయంగా చర్చ్ తరపున సంఘ సభ్యులు రూ. 1,35,000 లను ఎస్.ఎ. ఎల్.సి. సెంట్రల్ చర్చ్ కు అందించామని తెలిపారు. దేశంలో ప్రతి ఒక్కరూ ఎవరికి తోచిన విదంగా వారు మణిపూర్లోని బాధితులకు సహాయం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ అధ్యక్షుడు దివాకర్ కమిటీ సభ్యులు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గొంతుక మూగబోయింది
-డా.యం.ఉమేష్ రావు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి :ప్రజల కోసం తన జీవితాన్నే అంకితం చేసిన "ప్రజా గాయకుడు" గద్దర్ మృతితో ప్రజా గొంతుక మూగబోయిందని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.తనపాటలతో ప్రజా చైతన్యానికి ఎనలేని కృషి చేసిన "ప్రజా యుద్ధనౌక" గద్దర్ అని ఉమేష్ పేర్కొన్నారు.తన గళంతో ప్రజలను కదిలించిన గద్దర్ మృతితో ప్రజా ఉద్యమాల్లో పౌరహక్కుల పోరాటాల్లో ఒక శకం ముగిసినట్లు అయ్యిందని ఉమేష్ తెలిపారు. గద్దర్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుకుంటూ, ప్రజల కష్టాలను పాటల రూపంలో తనదైన శైలిలో బాహ్య ప్రపంచానికి తెలిసేట్లు చేసిన కళామతల్లి ముద్దుబిడ్డ గద్దర్ ఆత్మకు శాంతి చేకూరాలని ఉమేష్ ప్రార్థించారు.

శ్రీవారికి కొబ్బరి మొక్కు చెల్లించిన తిరుమలవాసులు

విశాలాంధ్ర - తిరుమల : టీటీడీ చైర్మన్ గా తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి రెండోసారి ఎంపిక కావడం పై కృతజ్ఞతగా శ్రీవారికి తిరుమల వాసులు కొబ్బరి మొక్కు చెల్లించుకున్నారు. ఈ మేరకు ఆదివారం శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న అఖిలాండం వద్ద 516 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందులో తిరుమల స్థానికులు, వైసీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర - గూడూరు : ప్రపంచమంతా మిమ్మల్ని వదిలిపోయినా మన చేయి పట్టుకుని నడిపించగలిగే మనస్సు ఉన్నవాడే నిజమైన స్నేహితుడని గూడూరు మండలం కొమ్మనేటూరు ఎంపీటీసీ సభ్యుడు గద్దం సహదేవ్ అన్నారు. ఆదివారం కొమ్మనేటూరు గ్రామంలో 32ఏళ్ల తర్వాత స్నేహితులందరూ ఒకచోట కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్నేహంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తే గాని తెలియదన్నారు. ఎటువంటి సంబంధం లేకుండా బలమైన బంధంగా ఏర్పడేది స్నేహమన్నారు. అటువంటి స్నేహితుల దినోత్సవం రోజు 1990-91 వ సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల కలయిక సంతోషదాయకన్నారు. గూడూరు రూరల్ మండలం కొమ్మనేటూరు గ్రామంలో కోట గురుకుల పాఠశాలలో 1990 -91 పదవ తరగతి చదివిన విద్యార్థులంతా కలిశారు. పాత జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి కూడా ఆ సంవత్సరం ఇక్కడ విద్య అభ్యసించిన పూర్వపు విద్యార్థులు, ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొమ్మనేటూరు ఎంపీటీసీ సభ్యుడు గద్దం సహదేవ్ మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవం రోజు మనమంతా ఇక్కడ కలవడం అత్యంత సంతోషదాయకం. 1990 సంవత్సరంలో మనమంతా ఇక్కడ పదవ తరగతి చదివాం. తర్వాత విడిపోయిన చాలా సంవత్సరాల తర్వాత మనమంతా ఎక్కడ కలవడం మర్చిపోలేని అనుభూతి అన్నారు. సమాజంలో పేరు మోసిన ఇంజనీర్లు ఉండొచ్చు, న్యాయవాదులు ఉండొచ్చు, గొప్ప వైద్యులు ఉండొచ్చు కానీ వీళ్ళందరూ అటువంటివారిని తయారు చేయలేరు. అలాంటి వారిని తయారు చేయగల ఏకైక అవకాశం, అగ్రస్థానం గురువులదే అటువంటి గురువులను జీవితాంతం మర్చిపోకుండా ముందుకు సాగాలన్నారు. ఈ బ్యాచ్ కి చెందిన వీర రాఘవులు అనే పూర్వపు విద్యార్థి ఇటీవలే పీహెచ్డీ పూర్తి చేసి డాక్టరేట్ ను పొందారు. దీంతో ఆయనను ఘనంగా సత్కరించారు.

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

తెదేపా ప్రభుత్వంలోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - రామకుప్పం: తెలుగుదేశం పార్టీ తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి మరియు ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి లు తెలిపారు. ఆదివారం మండల పరిధిలో నిర్వహిస్తున్న సైకిల్ యాత్రలో భాగంగా బందార్ల పల్లి గొరివిమాకన పల్లి పంద్యాలమడుగు పీఎంకే తాండా తదితర గ్రామాల గూండా సాగిన సైకిల్ యాత్ర సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజులలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అవినీతి అరాచకాలు తప్ప అభివృద్ధి శూన్యమని గతంలో తెదేపా అధికారంలో ఉన్న సమయంలో మాజీ ముఖ్యమంత్రి ఎటువంటి వివక్షకు తావు లేకుండా అన్ని వర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఇందుకు ప్రజల నుంచి వస్తున్న స్పందనే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సీతాపతి, రామకృష్ణప్ప, చిన్నికృష్ణ, మహమ్మద్ రఫీ , విజయ్ కుమార్ రెడ్డి, నియాజ్ అహ్మద్, వెంకట రమణ, వెంకటాచలం, బాలు , ఆదిల్ బాషా, నదీంబాషా, సత్యేంద్ర శేఖర్, మరియు భారీ ఎత్తున తెదేపా నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సీఐ చంద్రశేఖర్ సేవలు అభినందనీయం:డిఎస్పీ

విశాలాంధ్ర-కార్వేటినగరం: సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ సేవలు చిరస్మరణీయమని నగరి డివిజన్ డీఎస్పీ రవికుమార్ అన్నారు. తిరుపతి విజిలెన్స్ బదిలీపై వెళ్లిన సీ.ఐ చంద్రశేఖర్కు కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని ఎస్.ఐ పోలీస్ సిబ్బంది ఆదివారం ఘనంగా వీడ్కోల్ పలికారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలిసులు స్నేహ భావంతో మెలిగి ఉత్తమ అందించినప్పుడే ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఆ కోవలో విధులు నిర్వహించి అందరి అభిమానాలు చూర గొన్న వ్యక్తి చంద్రశేఖర్ అని అన్నారు. కేసులు చేదించిందంలోను, సిబ్బందిని అలర్టు చేయడంలోను, ప్రజా ప్రతినిధులతో కలసి శాంతి భద్రతలను నెలకొల్పడంలోను చంద్రశేఖర్ మించిన వారు లేరని అయన సేవలను డీఎస్పీ కొనియాడారు. ప్రతి పోలీస్ అధికారి సీ.ఐ చంద్రశేఖర్ను విధి నిర్వాహణలో ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్.ఐలు షేక్షావలీ, దస్తగిరి మాట్లాడు ఉన్నత భావాలు కలిగిన సీ.ఐ చంద్రశేఖర్ వద్ద పని చేయడం మా అదృష్టమని, ఆయన మాకు రోల్మోడల్ అని కొనియాడారు. క్రమంలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బందిలు పాత్రికేయులు కాలువలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీ.ఐ విశ్వనాథరెడ్డి, సురేష్ కుమార్, నాగరాజరావు, రాజశేఖర్, ఎస్.ఐ గోపి, ఏఎస్.ఐ మునికృష్ణ, సర్పంచ్లు ధనంజయవర్మ, కుప్పయ్య, వెంకటేష్, మాజీ ఎంపీటీసీ రాసిరెడ్డి, బాబురెడ్డి, పలువురు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా హెచ్ఎం సంఘం ఎన్నికలు

విశాలాంధ్ర -చిత్తూరు: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం చిత్తూరు నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిన ఎన్నికలకు పరిశీలనగా చంగల్ రాజు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా ఐరాల మండలం పై పల్లి ప్రధానోపాధ్యాయులు అరుణకుమార్, వీకోట మండలం చెందిన రవీందర్ నాథ్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా, తుమింద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హేమాద్రి ట్రెజరుగా ఎన్నికగా. మరో 24 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

సత్యాపౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తువులు పంపిణీ

విశాలాంధ్ర - కార్వేటినగరం: బీసీకాలనీలోని బేతేల్నారోన్ చర్చిలో సత్యాపౌండేషన్ డైరెక్టర్ మునికృష్ణయ్య ఆదివారం 250 మంది పేదలకు ఉచితంగా పాస్టర్ ఆశీర్వాధం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యాపౌండేషన్ డైరెక్టర్ మునికృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి ఏటా తమ సంస్థ ద్వారా పేదలకు, దుస్తువులు, అన్నదానం చేయడం ఆనవాయితీ అన్నారు. ప్రభువు యొక్క ఆశీస్సులతో ఉన్నత స్థాయిలో ఉన్నామని అయన కృప వల్లా ఎ పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభువును నమ్ముకున్నవారు నిత్యం ఆనందమయంగా ఉంటారని, సేవా భావం కలిగి ఉంటారని చెప్పారు. అనంతరం ఫాస్టర్ ఆశీర్వాదం మాట్లాడుతూ ఎంతో మంది దనికులున్నా.. పేదలకు సేవ చేసే భాగ్యం కొందరికే ప్రభువు కల్పిస్తారని గుర్తు చేశారు. అలాగే చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి ప్రభువు యొక్క వచనలను బోదించాలి. ఈ క్రమంలో భాగంగా దుస్తువులు పంపిణీతో పాటు 400 మందికి అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సత్యఫౌండేషన్ కార్యదర్శి సత్యవేణి. వేణుబాబు, పలువురు క్రిష్టియన్ సోదరులు పాల్గొన్నారు.

టిడిపి, వైకాపా నేతలు ఒకరిపై ఒకరు సవాళ్లు

విశాలాంధ్ర-పలమనేరు : పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం టిడిపి నాయకులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. గత నాలుగు రోజులుగా టీడీపీ, వైకాపా నేతలు ఒకరిపై ఒకరు సవాళ్లు ప్రతి సవాళ్లు చేసుకుంటున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా శనివారం వైకాపా నేతలు విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ టిడిపి నాయకులు ప్రసంగించారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి వచ్చిన స్పందనను చూసి ఓర్వలేక వైకాపా నేతలు కారుకూతలు కూస్తున్నారని, సభ్యత సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారు. ఇక వీరప్పల్లి పంచాయతీ పరిధిలో అమరనాథ్ రెడ్డి చేసిన అభివృద్ధి పై చర్చకు ఆధారాలతో సహా తాను సిద్ధమని వీరప్పల్లి ఎంపీటీసీ సభ్యులు సుబ్రహ్మణ్యం వైకాపా నేతలకు సవాల్ విసిరారు.ఈ సమావేశంలో నాయకులు ఆర్ బి సికుట్టీ, గిరిబాబు,నాగరాజు,లోకేష్,సుధాకర్, శ్రీనివాసులు,సుబ్బు,బాబాజాన్,నదీమ్, చెన్నరాయప్ప, సురేంద్ర, మురళీ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు ఘటనపై ప్రత్యేక బృందాల గాలింపు

విశాలాంధ్ర- చిత్తూరు: పుంగనూరు ఘటనలో పోలీసులపై దాడికి పాల్పడిన వారిని పట్టుకోవడానికి జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక బృందం ఏర్పాటు చేసింది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టులపై యుద్ధభేరి కార్యక్రమ పర్యటనలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అంగళ్లు పుంగనూరు వద్ద ఘర్షణలు చోటు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా పుంగనూరు వద్ద పోలీసులకు టిడిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటుచేసుకుని లాఠీ చార్జీ రాళ్ల దాడులు చోటు చేసుకోవడంతో పలు టిడిపి కార్యకర్తలతో పాటు 13 మంది పోలీసులతో తీవ్ర గాయాలు. ఈ ఘటనలో రెండు పోలీసు వాహనాలు ధ్వంసం అయ్యాయి. దీన్ని సీరియస్ గా తీసుకున్న పోలీసులు ఇప్పటికే 122 మందిపై కేసు నమోదు చేయగా 40 మందిని అరెస్ట్ చేశారు .మరికొందరిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లో ఉంచి విచారిస్తున్నట్లు సమాచారం . ఈ ఘటనలో ఏ వన్ నిందితుడుగా టిడిపి నేత చల్లా రామచంద్రారెడ్డి పై కేసు నమోదు చేశారు. ఇతని అరెస్ట్ చేయడానికి ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించారు. ప్రస్తుతం ఈ బృందాలు బెంగళూరు చెన్నై మదనపల్లి తదితర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలుస్తుంది పుంగనూరు వద్ద చోటు చేసుకున్న ఘర్షణకు సంబంధించి విజువల్స్ ను పోలీసులు దశలవారుగా పరిశీలిస్తూ నిందితులను గుర్తిస్తున్నారు. దీంతో మరికొందమై మరి కొంతమంది పై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది.

పోలీసుల పై దాడి కేసులో 61 మంది అరెస్ట్!



విశాలాంధ్ర-పుంగనూరు: ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటనలో భాగంగా జరిగిన దాడి సంఘటనపై జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి పలమనేర్ డి.ఎస్.పి సుధాకర్ రెడ్డి స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తో కలిసి ఆదివారం రోజున పుంగనూరు పోలీస్ స్టేషన్ నందు మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటనలో భాగంగా జరిగిన దుర్ఘటనపై జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి విచారణ జరపాలని ఆదేశించడం జరిగిందన్నారు విచారణలో భాగంగా టిడిపి ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డిని ఏ వన్ ముద్దాయిగా భావించి ఆయన వ్యక్తిగత కార్యదర్శి గోవర్ధన్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈనెల రెండవ తేదీన నియోజకవర్గంలోని పార్టీ నాయకులు కార్యకర్తలతో రొంపిచర్ల నందు చల్లా రామచంద్రారెడ్డి సమావేశం నిర్వహించినట్లు తెలియజేశారన్నారు. ఈ కేసును వేగవంతంగా విచారణ చేపట్టిన పుంగనూరు సిఐ ఎస్ఐ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. రాజకీయ పార్టీలు ఇలాంటి సంఘటన జరగకుండా చూడాలని పోలీసుల విధులకు ఆటంకం కలిగించకుండా రాజ్యాంగబద్ధంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

బియ్యం బహిరంగ దోపిడి

ఒక్కో తూకానికి 650 గ్రాముల బియ్యం స్వాహా...

విశాలాంధ్ర - వి. కోట : రాష్ట్ర ప్రభుత్వం దారిద్ర్య రేఖకు దిగువ నున్న పేదవారికి రేషన్ షాపుల డీలర్ల నుండి ఎండీయు వాహనాల ద్వారా ఇంటివద్దకే అందిస్తున్న రేషన్ బియ్యం తూకాలలో బహిరంగ దోపిడీ జరుగుతోంది. ఒక్కో తూకానికి 650 గ్రాముల బియ్యం చొప్పున కార్డు దారులు కోల్పోతున్నారు. ప్రతి తూకాన్నీ గోనె సంచితో కలపి వేస్తున్నారు. గోనె సంచి అర కేజీ నుండి 650 గ్రాముల వరకు ఉంటుంది. ఈ విషయం తెలియని కార్డు దారులు పాపం ఇచ్చింది తీసుకెళ్లి పోతున్నారు. ఇదే విషయమై ఇక్కడి తహాశీల్దారులను అడిగితే సింపుల్ గా 50 కేజీల బియ్యం బస్తాలు గోనె సంచితో కలిపే తూకంగా గోదాముల్లో నుండి డీలర్లకు వెళుతుంది అంటున్నారు. సరే ఒక్క యాభై కేజీల బస్తా కు ఒక్క సంచి లెక్కన ఒక్క 650 గ్రాముల బియ్యాన్ని డీలర్ నష్టపోతున్నాడని మనం అనుకుంటాం కానీ యాభై కేజీల బియ్యం పొందే కార్డు హెూల్డర్లు ఎంతమంది మంది ఉంటారు. అదే ఒక్క యాభై కేజీల బస్తా నుండి పది కేజీల బియ్యం పొందే వారు ఉంటారు ఇరవై కేజీల బియ్యం పొందే వారూ ఉంటారు ఇలా ఒక్క యాభై కేజీల బియ్యాన్ని నలుగురికి ఇచ్చే సమయంలో మూడు నుండి నాలుగు తూకాలు వేయాల్సి వచ్చినపుడు నాలుగు 650 గ్రాముల బియ్యం ఎవరి ఖాతాలో జమ ఔతుందో గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎండియూ వాహనాల్లో తూకాలు వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా యంత్రాలు ఇచ్చినా చాలా మంది ఎండీయువాహన దారులు డీలర్ల దగ్గర ఉండే వెయ్యింగ్ మెషిన్లను వాడుతూ పట్ట పగలు ప్రజల సమక్షంలోనే ప్రభుత్వ ధనాన్ని బహిరంగ దోపిడి చేస్తున్నారు. అంతేకాక ఇటీవల ప్రభుత్వం అందజేస్తున్న రాగులు సైతం దోచే స్తున్నారు. ఇచ్చేదే ఒక కిలో రాగులు వాటిని ఒక ప్లాస్టిక్ డబ్బాతో కలపి తూకం వేస్తున్నారు. ఆ ప్లాస్టిక్ డబ్బా కూడా 100 గ్రాములు పైన వందా యాభై గ్రాముల వరకు ఉంటుంది అంటే ఇచ్చే కిలో రాగుల్లోనూ నూట యాభై గ్రాములు స్వాహా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా పర్యవేక్షిం చాల్సిన అధికారులు మాత్రం ఎందుకు మౌనంగా ఉన్నారో.... ఆ పెరుమాళ్ కే ఎరుక... అంతేకాదు ఇళ్లవద్దకే వెళ్లాల్సిన బియ్యం సరఫరా వాహనాలు ఓ వీధి చివర నిలిపేసి అక్కడి నుండే అందరికీ ఇస్తారు. అంతమాత్రానికే వాహనాలు ఎందుకు వాటికి సిబ్బంది ఎందుకు వారికి జీత భత్యాలు ఎందుకో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి తూకాలలో జరుగుతున్న అవినీతి పై నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఒక మండలంలో నాలుగు వేల కార్డులుంటే వాటిలో అందరూ యాభై కిలోల బియ్యం తీసుకునే కార్డు దారులే ఉండరు ఒక్క 650 గ్రాముల బియ్యం నష్టపోడానికి. ఐదు కిలోల వారుంటారు. పదికిలోల వారుంటారు. పదిహేను కిలోల వారుంటారు ఇరవై, ఇరవై ఐదు, ముప్పై కిలోల చొప్పున ఉంటారు. ప్రతి తూకానికి గోనె సంచి తూకం తీసేస్తే... అంటే ఒక్కో నెలకి ఒక్కో ఎండీయు వాహనదారుడికి టన్నుల కొద్దీ బియ్యం అప్పనంగా అందుతోందన్న మాట. అధికారులు ఎంతమాత్రం స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

చిత్తూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ

విశాలాంధ్ర -చిత్తూరు: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్ లో పనిచేస్తున్న వివిధ కేటగిరీల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర సంఘం పిలుపు మేరకు చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీనీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ సలహాదారులు వి . సి.గోపీనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఏ.సత్యమూర్తి , గోపినాథ్ లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పర్మినెంట్ పారిశుద్ధ కార్మికుల సమస్యలతో పాటు ఇంజనీర్ విభాగంలో వివిధ కేటగిరిలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వాపోయారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని దశలవారీగా ఆందోళన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏ ఐ టి యు సి అనుబంధ రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా చిత్తూరులో నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కే.మణి, దాసరి చంద్ర, కే.రమాదేవి, లతా,మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూని యన్ నాయకులు వాసు, జయశంకర్, సురేష్ ,వినాయక , ఈశ్వన్, పరదేశి, వినోద్ కుమార్, శోభన్ బాబు, సుబ్రహ్మణ్యం మునిరత్నం, రవి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



విశాలాంధ్ర-వరదయ్యపాలెం : వరదయ్యపాలెం మండలం కదూరు క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టిన వరదయ్యపాలెం ఎస్సై నాగార్జున రెడ్డి ఆదివారం సెలవు దినం కావడంతో వరదయ్యపాలెం మండలంలోని పర్యాటక స్థలం ఉప్పల మడుగు కు పర్యాటకుల తాకిడి అధికం అవ్వడంతో తనిఖీలుచేపట్టిన ఎస్సై నాగార్జున రెడ్డి వాహన దారులు తగిన జాగ్రత్తలు పాటించాలని మరియు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించనివారికి త్రిబుల్ రైడింగ్ చేసినవారికి మరియు సరిఅయిన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా వేయడం జరిగింది. వాహనదారుల రక్షణ భద్రతకే తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్సై నాగార్జున రెడ్డి చెప్పడం జరిగింది.

గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన పులివర్తి సుధా రెడ్డి

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండలం కే వడ్డేపల్లి గ్రామపంచాయతీలో వెలసిన దొనకొండ గంగమ్మకు చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి ఆదివారం పట్టు వస్త్రాలను సమర్పించారు. దొనకొండ గంగమ్మ ఆలయం మహా కుంభాభిషేకం సందర్భంగా సుధా రెడ్డి పట్టు వస్త్రాలను తీసుకొని వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు , గ్రామస్తులు మేళతాళాలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు .అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మదనమోహన్ చౌదరి, సావిత్రి ,ఆలయ కమిటీ సభ్యులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన చెవిరెడ్డి దంపతులు

విశాలాంధ్ర- పాకాల : పాకాల మండలం కే వడ్డేపల్లి గ్రామపంచాయతీలో వెలసి ఉన్న దొనకొండ గంగమ్మకు ఆదివారం చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. దొనకొండ గంగమ్మ ఆలయం మహాభిషేకం సందర్భంగా తుమ్మలగుంట కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి తీసుకొచ్చిన పట్టు వస్త్రాలను గంగమ్మకు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ,అర్చకులు , గ్రామ పెద్దలు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి , ఉప సర్పంచ్ శ్రీరాములు రెడ్డి, విశ్రాంత తహసిల్దార్ రమేష్ బాబు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టిటిడి గోశాలకు గడ్డిని వితరణ చేసిన రైతు

విశాలాంధ్ర - ఐరాల : పూతలపట్టు మండలం తిమ్మిరెడ్డి పల్లికి చెందిన మధుసూదన్ రెడ్డి హేమలత భార్య భర్తలు ప్రకృతి వ్యవసాయం ద్వారా నవధాన్యాలను పండించి తిరుమల తిరుపతి గోశాలకు ఉచితంగా పంపిణీ చేశారు. మూడు నెలల పాటు వీరి భూమిలో పండించి ఎలాంటి రసాయన ఎరువులు వేయకుండా ద్రవ జీవామృతం. ఘన జీవామృతం లతో నవధాన్యాలు పండించారు. టిటిడి గోవులకి అందించాలని ఉద్దేశంతో సుమారు 7 టన్నుల గడ్డిని టిటిడి గోశాల అధికారి సుమన్ కి ఉచితంగా అందించారు. ప్రకృతి వ్యవసాయంతో చేసేసిన ఈ గడ్డిని పశువులు తినడం వల్ల వాటి ఆరోగ్యంతో పాటు మన ఆరోగ్యం కూడా బాగా ఉంటుందని నవధాన్యాలను పండిస్తున్నామని హేమలత తెలిపారు. నవధాన్యాల పంటకు ఎలాంటి చీడలు పట్టకుండా కషాయాలను పిచికారి చేస్తామని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతులుగా ఉంటామని వారు తెలిపారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి

ఉభయదారులు సహకరించాలి

ఆలయ చైర్మన్ ఏ. మోహన్ రెడ్డి - ఈవో వెంకటేశు

విశాలాంధ్ర - ఐరాల : స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నందు 2023 సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీ మణికంఠేశ్వర స్వామి ఆలయం నందు 14 గ్రామస్తుల ఆలయ ఉభయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఏ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు మాట్లాడుతూ సెప్టెంబర్ 18వ తేదీ వినాయక చవితి నుండి అక్టోబర్ 8 తెప్పోత్సవం వరకు 21 రోజులు జరుగు వార్షిక బ్రహ్మోత్సవాలు ఎంత వైభవంగా విజయవంతం చేయడానికి ఉభయదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, మాజీ ఆలయ చైర్మన్లు జగన్నాథరెడ్డి, మణి నాయుడు, ఏ ఈ ఓ లు ఎస్ వి కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, పర్యవేక్షకులు రంగస్వామి మరియు ఆలయ ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి అరాచకాలు ఎన్నాళ్ళు..?

పుంగనూరులో పోలీసులను అడ్డుపెట్టుకుని చేతగాని రాజకీయాలు
పెద్దిరెడ్డికి పాలేరుగా మారిన చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి
మంత్రివర్గం నుండి తప్పించకపోతే "ప్రజా పోరాటమే"
భారత చైతన్య యువజన పార్టీ" అధినేత రామచంద్ర యాదవ్

విశాలాంధ్ర- పుంగనూరు : ప్రశాంతంగా ఉండే పుంగనూరు నియోజకవర్గాన్ని మంత్రి పెద్దిరెడ్డి అధికార మదంతో.. అహంకారంతో.. అరాచకాలకు అడ్డాగా మార్చేశారని "భారత చైతన్య యువజన పార్టీ" అధినేత బోడె రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు.. పోలీసులను అడ్డం పెట్టుకుని చేతగాని చిల్లర రాజకీయాలు చేస్తున్నారని.., అతన్ని మంత్రివర్గం నుండి తప్పించకపోతే ఎంతవరకైనా పోరాడతామని ఆయన హెచ్చరించారు. పెద్దిరెడ్డి అరాచకాలకు అన్నివిధాలా సహకరిస్తున్న చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి హెూదాకు మచ్చ తెస్తున్నారని, పెద్దిరెడ్డికి పాలేరుగా తయారయ్యారని ఘాటుగా విమర్శించారు.. టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన నేపథ్యంలో శుక్రవారం పుంగనూరులో జరిగిన రాళ్లదాడి ఘటనలు, వైసీపీ రౌడీల దుశ్చర్య, పోలీసుల ఏకపక్ష వైఖరులను రామచంద్ర యాదవ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో ఇటువంటి దారుణమైన రాజకీయాలు జరగడం పెద్దిరెడ్డి రౌడీయిజానికి, వైసీపీ చేతగాని తనానికి, చిత్తూరు ఎస్పీ పాలేరు తనానికి నిదర్శనమన్నారు. ఈ ఘటనలపై వెంటనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పందించాలని, పెద్దిరెడ్డిని మంత్రివర్గం నుండి తప్పించాలని డిమాండ్ చేశారు, లేకపోతే ప్రజలే తరిమి కొడతారని హెచ్చరించారు. తాము ఈ అంశాన్ని కేంద్ర హెూమ్ శాఖ, మానవ హక్కుల సంఘం, ఎన్నికల కమీషన్ వరకు తీసుకువెళ్తామని పేర్కొన్నారు..

పుంగనూరులో ఎవరూ తిరగకూడదా..!?

"పుంగనూరు నియోజకవర్గం ప్రశాంతతకు మారుపేరు, ఎన్నికలప్పుడే రాజకీయం ఉంటుంది, మిగిలిన సమయాల్లో ప్రజల మధ్య ప్రశాంత జీవనం ఉంటుంది.. కానీ పెద్దిరెడ్డికి అధికార మదం తలకెక్కి, పోలీసులను, కొందరు వైసీపీ గూండాలను వాడుకుని నియోజకవర్గంలో కుట్రలు, కల్మషాలను రెచ్చగొడుతున్నారు.. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిస్తున్నారు. ప్రతిపక్ష నాయకులు అక్కడ తిరగకూడదన్నట్లు ప్రవర్తిస్తున్నారు" అంటూ రామచంద్ర యాదవ్ వివరించారు. గత వారం కూడా తన పర్యటనను అడ్డుకున్నారని, తన అనుచరులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని.. రాత్రి వేళా కూడా వేధించారని గుర్తు చేశారు. చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి పెద్దిరెడ్డికి బానిసగా మారి, జిల్లా పోలీసు యంత్రాంగం మొత్తాన్ని పెద్దిరెడ్డికి పని మనుషుల్లా చేసి, సొంత వ్యవహారాలకు, చిల్లర రాజకీయాలకు సహకరించేలా మార్చేశారని ఆరోపించారు. గత వారం తన పర్యటనను, నేడు చంద్రబాబు గారి పర్యటనను అడ్డుకోవడం వెనుక పెద్దిరెడ్డిలో భయం కనిపిస్తుందని.. ఆ భయం వల్లనే ఇలా రాజ్యాంగ విలువలు పాటించకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ అంశాన్ని ఇక్కడితో విడిచిపెట్టమని.. సీఎం జగన్ వెంటనే స్పందించకుంటే.. ప్రజాక్షేత్రంలో పెద్దిరెడ్డిని తరిమి కొట్టడమే కాకుండా, ఢిల్లీ స్థాయిలో అతన్ని చట్టం ముందు దోషిగా నిలబెడతామని రామచంద్ర యాదవ్ హెచ్చరించారు.

అనధికారిక మట్టి తరలింపు అడ్డుకోండి

విశాలాంధ్ర -బంగారుపాళ్యం: మండలంలోని చికూరుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మంచినీళ్ల కుంట నుండి పలువురు అనధికారికంగా జెసిబిల ద్వారా మట్టిని తరలిస్తున్నారని అడ్డుకోవాల్సిందిగా పలువురు గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా విలేఖరులతో గ్రామస్తులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కుంటనుండి మట్టిని తరలించుకు వెళ్ళిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీళ్ల కుంట వద్దకు వెళ్లి విలేకరులు పరిశీలించగా గ్రామానికి చెందిన జయకుమార్ జెసిబి యంత్రంతో మట్టిని తరలించేందుకు ప్రయత్నిస్తుండగా ప్రశ్నించిన విలేకరుల పట్ల సైతం నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం. కాగా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిని అధికారులు అడ్డుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర- చిత్తూరు: చెర్లోపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొక తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. తిరుపతి చెందిన శ్రీనివాస్(53) మరో వ్యక్తితో కలిసి స్కూటర్లో వస్తుండగా కర్ణాటకాకు చెందిన కారును ఢీకొనడంతో శ్రీనివాస్ అక్కడికక్కడ మృతి చెందగా ద్విచక్ర వాహనంలో ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చిత్తూరు ఆసుపత్రికి తరలించారు. చిత్తూరు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

గద్దర్ మరణం తీరని లోటు

విశాలాంధ్ర-పలమనేరు : గద్దర్ మరణం విప్లవ సాహిత్యానికి తీరని లోటని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి తులసి నాదం నాయుడు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పాటల ద్వారా ప్రశ్నించే గొంతు గద్దర్ అన్నారు. తెలుగు జాతి ఉన్నంతవరకు ఆయన పాటలు నిలిచి ఉంటాయన్నారు.

లక్ష్మమ్మ కుటుంబాన్ని పరామర్శించిన తుడా చైర్మన్



విశాలాంధ్ర - కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీపేట గ్రామానికి చెందిన తుడా అడ్వైజర్ శివాల దామోధర్రెడ్డి తల్లి ఎస్.లక్ష్మమ్మ(81) కొనాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం మృతి చెందారు. సమాచారం అందుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్రెడ్డి ఆదివారం ఆర్కేవీబీ పేట గ్రామానికి వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం వారి కుటుంసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట వెంకటరెడ్డి ఉన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

విశాలాంధ్ర-చిత్తూరు : జన నాట్యమండలి నాయకుడు గద్దర్ మరణం తీరనిలోటని జిల్లా తెలుగుదేశం పార్టీ నేతలు దొరబాబు, నాని, సురేంద్ర కుమార్, కోదండ యాదవ్ మోహన్ రాజులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆయన చిత్ర సీమ తోపాటు ప్రజా ఉద్యమంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని తన పాటలతో మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తిని కొనియాడారు. పౌర హక్కుల కోసం నిరంతరం పోరాడినటువంటి వ్యక్తిగద్దర్. ప్రజా నాయకుడు మృతికి. జిల్లా తెలుగుదేశం పార్టీ తీవ్ర ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు .ప్రజా ఉద్యమాల పోరాటంలో పాటలకు ఊపిరి పోసిన వ్యక్తిగద్దర్ ని అతని మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - పులిచెర్ల-కల్లూరు:- పులిచెర్ల మండలాభివృద్ధికి అందరి సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామని ఎంపీపీ సురేందర్ నాథ్ రెడ్డి అన్నారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో మంజూరైన నిధులతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఇందుకు అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు పోవాలన్నారు. ఎంపీడీవో రాజశేఖర్ బాబు మాట్లాడుతూ మండలంలోని గ్రామపంచాయతీలకు మంజూరైన ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. తహశీల్దార్ శేషగిరిరావు మాట్లాడుతూ మండలంలో భూ సమస్యల పరిష్కారానికి సత్వరమే కృషి చేస్తున్నామని అన్నారు. వైద్యాధికారిని జానకి రావు మాట్లాడుతూ గ్రామాలలో వర్షాకాలంలో సోకే అంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్న విధంగా అందరూ సహకరించాలన్నారు. వ్యవసాయ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ వేరుశనగ సాగు వర్షాభావంతో తక్కువగా సాగు చేశారని ప్రత్యామ్నాయ పంటలకు రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ట్రాన్స్ కో ఏఈ పురుషోత్తం మాట్లాడుతూ మండలానికి 6 సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరములు లేకుండా చూస్తున్నామని అన్నారు. హౌసింగ్ ఏఈ త్యాగరాజు మాట్లాడుతూ పక్క గృహాలు మంజూరు కాలనీలలో విద్యుత్ మంచినీటి వసతి కల్పిస్తున్నామని లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసేందుకు అందరూ సహకరించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో మండలంలోని చిరు వ్యాపారులకు సోలార్ లైట్లు ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు రాశీ ప్రసాద్, ఈశ్వరి గోవర్ధన్ ,ఎంపీటీసీలు సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.

టిసి రాజన్ కు ఘన సన్మానం

విశాలాంధ్ర - పలమనేరు: పట్టణ సమీపంలోని మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో నిఎన్ ఎస్ఎస్ యూనిట్ తరఫున మేర మతి మేరా దోస్త్ అనే కార్యక్రమంలో భాగంగా పలమనేరులోని స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ శాసనసభ్యులు టీ సిరాజన్ ను ఘనంగా సత్కరించారని కళాశాల కరస్పాండెంట్ ఎం రవీంద్రబాబు తెలిపారు. అనంతరం సన్మాన గ్రహీత టి సి రాజన్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలలో విలువలు లోపించాయని విలువల పునరుద్ధరణకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కృషి చేయాలని ఉద్బోధించారు. ఎస్ కే యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు కె. వెంకటరెడ్డి టి సి రాజన్ యొక్క గొప్పతనాన్ని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎం రవీంద్రబాబు తోపాటు కళాశాల చైర్మన్ ఎంఆర్ సునీల్, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇంచార్జ్ కిషోర్,అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర తిరుపతి జిల్లా

హింస కు వ్యతిరేకంగా జరిగే రాష్ట్ర సభను జయప్రదం చేయండి

ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి సాయి లక్ష్మి పిలుపు

విశాలాంధ్ర - తిరుపతి: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి సాయి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం డ్రగ్స్, నియంత్రించాలని మహిళలపై జరిగే హింస అరికట్టాలని కోరుతూ గత నెల 28వ తేదీన సత్యసాయి జిల్లా హిందూపూర్ నుండి బస్సు యాత్ర ప్రారంభమై అన్ని జిల్లాలు తిరుగుతూ మహిళా లను చైతన్యం చేస్తూ ఈనెల 8వ తేదీన విజయవాడ చేరుకుంటుంది. ఆ సందర్భంగా భారీ బహిరంగ సభ జింఖానా గ్రౌండ్ నందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఐద్వా కేంద్ర నాయకురాలు మాజీ ఎంపి బృందాకారత్ విచ్చేయుచున్నారు. మహిళా పై జరిగే హింస కు వ్యతిరేకంగా పోరాడాలని, కోరారు. ఈ సభకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

టీడీపీ గూటికి సంఘ సేవకులు బొల్లినేని: చంద్రబాబు సమక్షంలో చేరిక

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రముఖ సంఘ సేవకులు, జేకే స్టీల్ అధినేత, శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథం నాయుడు తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు కండువా కప్పి బొల్లినేని జగన్నాథంనాయుడును పార్టీలోకి ఆహ్వానించారు. బొల్లినేని జగన్నాథంనాయుడు మొదట టీడీపీలో ఉండేవారు. దివంగత మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు బొజ్జల హరినాథరెడ్డితో ఈయనకు ఎంతో సన్నిహిత సంబంధం ఉండేది. అయితే కొన్ని అనివార్య కారణాల వలన ఆయన 2019 ఎన్నికలకు మునుపు టీడీపీకి దూరమయ్యారు. ఆ తరువాత పేదలకు సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. ఈ సేవా కార్యక్రమాలతో బొల్లినేని జగన్నాథంనాయుడుకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఆయనకు ఎంతో మంది అభిమానులు ఏర్పడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఆయన ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. తనకంటూ ఒక ప్రత్యేక వర్గం ఏర్పరుచుకున్న బొల్లినేని జగన్నాథంనాయుడును టీడీపీకి గూటికి మళ్లీ వచ్చే విధంగా బొజ్జల బృందమ్మ, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఎంతో ప్రయత్నం చేసి సఫలమయ్యారు. వారి కోరిక మేరకు శ్రీకాళహస్తిలో జరిగిన సభలో చంద్రబాబు నాయుడు సమక్షంలో ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బొల్లినేని రాకతో టీడీపీకి చాలా బలం పెరగనుంది.

టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ సన్నాహక సమావేశం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతిష్టాత్మకంగా టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం గూడూరులోని శ్రీచైతన్య స్కూల్ లో క్రికెట్ పోటీల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో టోర్నమెంట్ టెక్నికల్ డైరెక్టర్, పీడీ కరీముల్లా, బాబర్, మునిభాస్కర్, శ్రీహరి, బాలాజీ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటిలో సీటు సాధించిన ఆర్‌సిపి హైస్కూల్ విద్యార్థి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : ఆర్ సి పి హైస్కూల్ విద్యార్థి సి.శివకేశవ ట్రిపుల్ ఐటిలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ కాపిరెడ్డి డిల్లీబాబు రెడ్డి మాట్లాడుతూ ఈ నెల విడుదలైన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీస్(ఆర్జి యు కె టి) ఎ పి -2023 ఫలితాల్లో పిచ్చాటూర్ రోడ్డు లోని ఆర్ సి పి స్కూల్ విద్యార్థి సి. శివ కేశవ ట్రిపుల్ ఐటిలో సీటు సాధించాడని తెలిపారు. పదవతరగతి పరిక్షల్లో 573 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటి నూజివీడులో సీటు సాధించిన సి. శివ కేశవ ని కరస్పాండెంట్ డిల్లీబాబు రెడ్డి, హెడ్ మాస్టర్ సుప్రజ ఘనంగా సత్కరించారు.

ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు

ఏడవ అదనపు జిల్లా జడ్జ్ షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం

విశాలాంధ్ర - గూడూరు : ర్యాగింగ్ కు పాల్పడితే కఠినమైన చట్టాలు ఉన్నాయని వాటిపై నేటి తరం యువతీ యువకులు అవగాహన కలిగి ఉండాలని కళాశాలలో జూనియర్లు సీనియర్లు సోదర భావంతో ఉండాలని ఏడవ అదనపు జిల్లా జడ్జ్ షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం వెల్లడించారు. ఆదివారం గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణకై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏడవ అదనపు జిల్లా జడ్జ్ షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం మాట్లాడుతూ కళాశాలలో వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు వస్తారని, జూనియర్లు సీనియర్లు అందరూ కలిసి సోదర భావంతో ఉండాలని తెలిపారు. ర్యాగింగ్ నివారించేందుకు కఠినమైన చట్టాలు తీసుకువచ్చారని వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తూ ఉన్నారని వారి ఆశయాలను నెరవేర్చి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ సులోచన రాణి, న్యాయవాదులు గోపికృష్ణ, అరవ పార్వతయ్య, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవ గోడపత్రికలు ఆవిష్కరణ

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : గిరిజన ఐక్యవేదిక, ఆంధ్రప్రదేశ్ యానాది సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 9వ తేదిన అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకొని వెంకటగిరి నియోజవర్గం లో ఏపీసి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఎద్దుల వీరయ్య ఏసి ఫంక్షన్ హాల్ నందు జరుగు అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవ గోడపత్రికలను ఆదివారం శ్రీకాళహస్తి రాజీవ్ నగర్, ఎమ్మెస్సార్, చెంచులక్ష్మి యానాది కాలనీ ఆఫీస్ నందు గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు చందమామల కోటయ్య మాట్లాడుతూ యానాదులకి సపరేట్ ఐటీడీఏ తిరుపతి జిల్లాకి ఇవ్వాలని, యానాదులకి సపరేట్ కార్పొరేషన్ కావాలని కోరారు. గిరిజన వేదిక అధ్యక్షులు మోపురదివయ్య మాట్లాడుతూ అడిగే హక్కు చట్టం కింద భూమిలేని ప్రతి ఆదివాసులకి 10 ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తుపాకుల రామచంద్రయ్య మాట్లాడుతూ నియోజవర్గ స్థాయిలో గిరిజన భవనం కేటాయించాలని కోరారు. కొమకూరు శీను మాట్లాడుతూ శ్రీకాళహస్తి, కాణిపాకం, తిరుపతి దేవస్థానంలో నామినేడు పోస్టులను ఆదివాసిలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9 అనగా బుధవారం గిరిజనులకు ఇచ్చిన స్వతంత్ర దినం అని, ప్రతి ఒక్కరు నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు చందమామల కోటయ్య పిలుపునిచ్చారు. ఎమ్మెస్ ఎమ్మెస్సార్ చెంచులక్ష్మి కార్యాలయం నందు జరిగిన కార్యక్రమంలో లక్ష్మమ్మ, రత్నయ్య, గంగా గౌరి, వసంతరావు, ఎన్.వెంకటేశు, ఏం. లోకయ్య, కనకమ్మ, చెల్లెమ్మ, రవీంద్ర, వాసు, రాధమ్మ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మాతమ్మ జాతర

అమ్మవారిని దర్శించిన ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీలో మాతమ్మ జాతర అత్యంత వేడుకగా సాగింది.ఆదివారం ఆలయానికి విచ్చేసిన మోహిత్ రెడ్డికి సర్పంచ్ ప్రదీప్ కుమార్ రెడ్డి, పార్టీ పంచాయతీ అధ్యక్షులు ధరణి కుమార్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం అమ్మవారిని దర్శించుకున్న మోహిత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలో వివిధ రంగులతో అందంగా తీర్చిదిద్దిన మాతమ్మవారి ప్రతిమ విశేషంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో పంచాయతీ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోగిలిలో భారీగా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం

విశాలాంధ్ర-చిట్టమూరు:మండల పరిధిలోని కోగిలి పంచాయతీ పరిధిలో చిట్టమూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు క్రాంతి మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు జనసేన పార్టీ నాయకులు తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం కోగిలి గ్రామంలో భారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగినది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గ్రామాలలోనికి వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేసి సభ్యత్వం నమోదు కార్యక్రమం చేయించడం వలన వారికి జీవిత బీమా ఇన్సూరెన్స్ వర్తిస్తుంది అని అంతేకాక జనసేన పార్టీ సభ్యులుగా గుర్తింపు పొందుతారన్నారు.ఈ కార్యక్రమంలో సభ్యత్వం నమోదు చేసుకున్న ప్రతి కార్యకర్తకు జనసేన పార్టీ కిట్లను పంచిపెట్టారు.వీరి వెంట శరత్,రాము,వాసు,వినోద్,అక్బర్,ప్రశాంత్, రాకేష్ పవన్ కళ్యాణ్ యూత్ సభ్యులు ఉన్నారు.

లౌకిక ప్రజాస్వామ్య రక్షణకే జన సేవాదళ్

సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి

విశాలాంధ్ర - తిరుపతి: లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జన సేవాదళ్ పనిచేస్తుందని తిరుపతి సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి అన్నారు తిరుపతిలోనే సిపిఐ పార్టీ ఆఫీసులో ఆదివారం జరిగిన జన సేవాదళ్ సైనిక శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మతోన్మాద పార్టీల పోకడలు పెచ్చు మీరు పోతున్నాయి అన్నారు దేశభక్తి కలిగి నిరంతరం వివిధ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రజల అభిమానాలు చురగున్న ఏకైక సంస్థ జన సేవాదళ్ అన్నారు ప్రకృతి వైపరీత్యాలు విపత్కర పరిస్థితిలో సంభవించినప్పుడు ఆయా ప్రాంతాలకు వెళ్లి బాధితులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు అగ్ని ప్రమాదాలు, వరదలు, తుఫానులు, భూకంపాలు, వంటి సమయంలో తమ కార్యకర్తలు ముందుంటారన్నారు 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన యువతి యువకులు పాల్గొని దేశా సంరక్షణకు పాటుపడాలన్నారు ప్రస్తుత పరిస్థితుల్లో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ ఆగడాలకు ఎంతోమంది వివిధ నిమన్న కులాల , మతాలు వారు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నేడు ఉందన్నారు ఇలాంటి పరిస్థితుల్లో మనం ఐక్యంగా పోరాటాలు కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ సిపిఐ నగర కార్యదర్శి జే విశ్వనాథ్, ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు, రామకృష్ణ, కత్తి రవి,జనసేవ దళ్ రాష్ట్ర ఇన్స్ట్రక్టర్లు మురళీకృష్ణ, టి ఎల్ వెంకటేష్ ,శశి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి, నదియా, నాగరాజు మహేంద్ర సునీల్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబూ.. దమ్ముంటే నామీద పోటీ చేయండి

-ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి సవాల్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: "చంద్రబాబూ..! నా మీద పోటీకి బొజ్జల సుధీర్ రెడ్డి చాలరు దమ్ముంటే మీరు కానీ మీ కుమారుడు నారా లోకేష్ కానీ శ్రీకాళహస్తికి వచ్చి పోటీ చేయండి. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో నేను అవినీతికి పాల్పడుతున్నానని ఆరోపించారు. అవినీతిపై విచారణకు మీరు సిద్ధమా..? అయితే శ్రీకాళహస్తి రండి. అవినీతి, అభివృద్ధిపై విచారణకు నేను సిద్ధంగా ఉన్నా" అని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి సవాల్ విసిరారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' పేరుతో శ్రీకాళహస్తిలో శనివారం నిర్వహించిన సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మాట్లాడిన మాటలన్నీ అబద్ధాలే అన్నారు. చంద్రబాబునాయుడుకు వయసు మళ్లి ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆయన మాట్లాడే మాటలకు పొంతన ఉండటం లేదని బియ్యపు మధు విమర్శించారు. తాను అక్రమాలకు పాల్పడుతున్నానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. బొజ్జల కుటుంబం లాగా ఎర్రచందనం స్మగ్లింగ్, పేదల భూమి కబ్జా చేయలేదన్నారు. తమది జమీందారీ కుటుంబం అన్నారు. తన తాత రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేశారని ఆయన గుర్తు చేశారు. తాను బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి సంపాదించిన సొమ్మును పేదల కోసం ఖర్చు చేస్తున్నానని ఆయన చెప్పారు. ఈసారి కుప్పంలో చంద్రబాబుకు ఘోర పరాభవం తప్పదన్నారు. చంద్రబాబును కుప్పంలో జగన్ తప్పకుండా ఓడిస్తార న్నారు. తనకు తక్కువ అనుభవం ఉన్నప్పటికీ ధైర్యం ఉంటే చంద్రబాబు కానీ... నారా లోకేష్ కానీ తనపై పోటీ చేసి గెలవాలన్నారు. బొజ్జల కుటుంబం పూర్తిగా అవినీతిలో కూరుకు పోయిందన్నారు. శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో బొజ్జల బృందమ్మ వెండి తీసుకెళ్లినందుకు ఓ అధికారి కుటుంబం ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందన్నారు. బొజ్జల సుధీర్ తన చిన్నాన్న బొజ్జల హరినాథరెడ్డిని చంపేశారని బియ్యపు మధు ఆరోపించారు. బొజ్జల సుధీర్ రెడ్డికి భయపడి హరినాథరెడ్డి కుమారుడు సురేష్ రెడ్డి హైదరాబాదుకు వెళ్లి పోయారన్నారు. ఆయన భయపడకూడదని... తాను అండగా ఉంటానని ఇటీవల ఇతరులతో చెప్పిపంపానన్నారు. ఇలాంటి నీచపు రాజకీయాలు చేసే బొజ్జల సుధీర్ రెడ్డి ఎన్నికల్లో తనపై పోటీకి అర్హుడు కాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో చర్చించి బొజ్జల కుటుంబం చేసిన అక్రమాలు, భూ కబ్జాలపై విచారణ చేయిస్తామన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ ను ఉత్తరకొరియాతో పోల్చడం విడ్డూరంగా ఉందన్నారు. కిమ్ రాజనీతి చంద్రబాబుకు సరిగా సరిపోతుందన్నారు. ఉత్తర కొరియా అధ్యక్షులు కిమ్ లాగా చంద్రబాబు కూడా అతని మామ నందమూరి తారక రామారావుకు వెన్నుపోటు పొడిచారని ఆయన ఆరోపించారు. జగన్ తన సోదరి వైఎస్ షర్మిలకు ఆస్తిలో హక్కు కల్పించలేదని చంద్రబాబు ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు సంపాదించిన ఆస్తిలో ఆయన సోదరుడు నారా రామ్మూర్తి నాయుడుకు ఎందుకు వాటా ఇవ్వలేదన్నారు. నారా రామ్మూర్తి నాయుడుకు స్లో పాయిజన్ ఇచ్చి బయటకు రాకుండా చేశారన్నారు. నారా రోహిత్ సినిమాల్లో అవకాశం లేకుండా లోకేష్ చేస్తున్నారన్నారు. వైఎస్ షర్మిలకు జగన్ ఆస్తిలో ఎంత వాటా ఇచ్చారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. బొజ్జల సుధీర్ రెడ్డిని ఆయన వీరప్పన్ తో పోల్చారు. తాను శ్రీకాళహస్తిలో ఎంత అభివృద్ధి చేశానో చర్చకు సిద్ధమన్నారు. స్వర్ణముఖి సుందరీకరణ, ఏడు రింగు రోడ్లు, హిందూ స్మశాన వాటిక, తొట్టంబేడు మండల రైతులకు తెలుగుగంగ నీరు ఇవన్నీ తన హయాంలో చేసినవే అన్నారు. మహాశివరాత్రికి 16ఏళ్లుగా బంగారు తాళిబొట్లు పంపిణీ చేస్తున్నానని ఆయన చెప్పారు. తన హయాంలో శ్రీకాళహస్తీశ్వర ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. చంద్రబాబు నిర్లక్ష్యం కారణంగానే రేణిగుంట మండలంలోని బాలాజీ రిజర్వాయరు పనుల్లో జాప్యం చోటు చేసుకుందన్నారు. శ్రీకాళహస్తి ప్రజలకు అన్నీ ఎవరు ఎలాంటి వారో అందరికీ తెలుసని తగిన సమయంలో వారు తగుబుద్ధి చెబుతారన్నారు.

కార్యకర్తలు జోలికి వస్తే సహించేది లేదు: పులివర్తి నాని

విశాలాంధ్ర - రామచంద్రాపురం : కులమత బేధాలు లేని పార్టీ తెలుగుదేశం పార్టీ అని చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. ఆదివారం రామచంద్రపురం మండలంలోని నడవలూరులో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కిషోర్ రెడ్డి అధ్యక్షతన అదే గ్రామానికి చెందిన ఎం. సాయి ప్రసాద్ రెడ్డి తో పాటు అతని అనుచరులను పులివర్తి నాని సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. ఈ క్రమంలోని నాని వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను అందరి కులస్తుల వాడిని నాకు అందరు సమానం అన్నారు. నా కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని అందుకు నేను దేనికైనా సిద్ధంగా ఉంటానని చెప్పారు, కొత్త, పాత కలిస్తేనే మనం బాగుంటామని అందరూ కలిస్తేనే విజయం సాధించగలమని పేర్కొన్నారు. కేకేవీ పురం లో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఎందుకు మార్చారు, అలాగే మండలంలోని రాయల చెరువు అభివృద్ధి ఏం చేశారని వాపోయారు చంద్రగిరి నియోజకవర్గంలో రోడ్లు ఎలా ఉన్నాయో మన అందరికీ తెలుసు అని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అందరూ కలిసి ఏకమై చంద్రగిరి కోటపై పసుపు జెండా ఎగరేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన్ చౌదరి, చిన బాబు, ఢిల్లీ నాథ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ధనంజయ రెడ్డి, కమలాకర్ రెడ్డి, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, గిరిధర్ రెడ్డి, ముని రామిరెడ్డి, హరి ప్రసాద్, దినేష్ రెడ్డి, అధిక సంఖ్యలో కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ

ఆసక్తిగా తిలకించిన ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

అన్నదాన కార్యక్రమాలకు రూ.1 లక్ష విరాళం

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీలోని శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయ ప్రాంగణంలో మహాభారత ఉత్సవాలు అత్యంత వేడుకగా సాగుతున్నాయి. ఈ వేడుకలకు విచ్చేసే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహణ కోసం రూ.1 లక్ష నగదును చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విరాళంగా అందజేశారు. మహాభారత ఉత్సవంలో ఆదివారం ఉదయం జరిగిన దుర్యోధన వధ ఘట్టం ఆహుతులను అలరించింది. ముందుగా మోహిత్ రెడ్డిని సర్పంచ్ ప్రసాద్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా మోహిత్ రెడ్డి విచ్చేసి ఈ ఘట్టాన్ని ఆసక్తిగా తిలకించారు. సోమవారం ఉదయం ద్రౌపతి, ధర్మరాజుల పట్టాభిషేకం, సాయంత్రం ఊరేగింపు కార్యక్రమాలతో మహాభారత ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని వెల్లడించారు. దుర్యోధన వధను వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రజలకు మోహిత్ రెడ్డి అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ మునిరెడ్డి, ఆలయ ఉభయ దాతలు తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

విశాలాంధ్ర- వరదయ్యపాలెం : వరదయ్యపాలెం- బీఎన్ కండ్రిగ మధ్యలో చోటుచేసుకుంది ఎన్టీఆర్ నగర్ కాలనీ దగ్గర ఎన్టీఆర్ నగర్ కాలనీ దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది స్థానికులు గుర్తించి వెంటనే 108 వాహనం ద్వారా ఆసుపత్రి కి తరలించారు కారులో ఐదుగురు ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. అలాగే పోలీస్ సిబ్బంది విషయం తెలిసిన వెంటనే చేరుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సింది.

వైసీపీ నాయకులు టిడిపిలో చేరిక

విశాలాంధ్ర- వాకాడు: వైసిపి నాయకులు భారీగా తెలుగుదేశం పార్టీలో ఆదివారం చేరడం జరిగినది మండల టిడిపి పార్టీ అధ్యక్షులు దువ్వూర మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పూడిరాయిదొరువు పంచాయతీ మాజీ సర్పంచ్ యల్లబోతు రాజగోపాల్ రెడ్డి అధ్యక్షతన 200 కి పైగా వైసీపీ కుటుంబాల వారు గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో టిడిపి పార్టీ కండువాలు కప్పుకున్నారు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ పూడిరాయి దొరువు పంచాయతీ నుండి 4 వార్డు మెంబర్స్ సీనియర్ నాయకులు చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధి కోసం మీరంతా టీడీపీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు మీ నమ్మకాన్ని నేను ఒమ్ము చేయకుండా రేపు టిడిపి అధికారంలోకి రాగానే మన నాయకుడు చంద్రబాబు నాయుడు సహకారంతో పంచాయతీలో ఏదైతే కోరారో అవి కచ్చితంగా నేను చేస్తానాన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్,కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య,పూడిరాయిదొరువు పంచాయతీ నాయకులు,మామిడి గోవిందయ్య,మాజీ ఉపాధ్యక్షులు తంగా సుబ్బారెడ్డి,అయిల్ రెడ్డి,మీరాల్ రెడ్డి,తీపలపూడి రమణయ్య,చినిగి వెంకటేశ్వర్లు,వార్డు మెంబర్లు జయమ్మ,మీనా,నాగభూషణమ్,మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కారు లారీ ఢీ - వ్యక్తి మృతి

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : తడ శ్రీ కాళహస్తి రహదారి నందు కారు లారీ ఢీ కొన్న సంఘటన ఆదివారం ఎన్ టి ఆర్ నగర్ సమీపాన చోటు చేసుకున్నది.రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం. పోలీసులు కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి, చెన్నై పట్టణానికి చెందిన ఐదుగురు మంది స్నేహితులు కారులో శ్రీకాళహస్తికి వెళుతుండగా శ్రీకాళహస్తి నుంచి లారీ తమిళనాడు వైపు వెళుతుండగా మండలంలోని ఎన్ టి ఆర్ నగర్ వద్ద అతివేగంగా వెళుతున్న లారీ కారు ఢీకొనడంతో కారు నుజ్జు నుజ్జు అయింది. స్థానికులు 108 సమాచారం అందిస్తుగా అస్ ఘర్ 42 వ్యక్తికి తీవ్రమైన గాయాలు కావడంతో 18 సిబ్బంది శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి మెరుగైన వైద్య కోసం తీసుకెళ్లారు వైద్యం చేస్తుండగా ఆ వ్యక్తి మృతి చెందారు, గాయాలైన నలుగురు వ్యక్తులకు ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు,జరిగిన సంఘటనపై ఎస్సై మంజునాథరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

ఒకటవ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని ఒకటవ వార్డులో ఆదివారం సాయంత్రం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు, పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు సూచనలతో ఒకటవ వార్డులో మహాశక్తిలో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా టీడీపీ మినీ మేనిఫెస్టోపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోను శివకుమార్, కస్తూరి గురవయ్య, అడపాల శివ, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, కార్యదర్శి శ్రీపతి నరసమ్మ, గుండాల భారతి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తాళ్ల సుబ్బమ్మ, మాజీ కౌన్సిలర్లు కస్తూరి విజయమ్మ, కోడిపర్తి కల్పన, నిమ్మల సరస్వతమ్మ, పట్టణ మహిళా అధ్యక్షురాలు గుండాల శ్రీదేవి, మల్లి శ్యామల, పోబాక లక్ష్మి, సుధా, సుబరత్నమ్మ, తాటిపర్తి రేవతి, తదితరులు పాల్గొన్నారు.

కరుణాకర్ రెడ్డిని కలిసిన కురబసంఘం

విశాలాంధ్ర - తిరుపతి: తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి రెండవసారి తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్గా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర కురబ సంఘం ఉపాధ్యక్షులు మరియు తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షులు కొల్లే రెడ్డి కుమార్ , తిరుపతి జిల్లా అధ్యక్షులు మంగిరి రెడ్డప్ప , రాష్ట్ర యువత వర్కింగ్ ప్రెసిడెంట్ గుండ్లూరు శ్రీనివాసులు సంఘం జిల్లా సభ్యులు కరునన్నను కలిసి భూమన స్వగృహంలో శుభాకంక్షలు తెలిపారు.

కరుణాకర్ రెడ్డిని కలిసిన మేయర్ దంపతులు

విశాలాంధ్ర - తిరుపతి: తిరుపతి శాసనసభ్యుడు భూమన కరుణాకర్ రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్ గా నియమితులైన భూమన కరుణాకర్ రెడ్డి కి ఆదివారం ఉదయం పద్మావతిపురంలో మేయర్ దంపతులు మేయర్ డాక్టర్ శిరీష, డాక్టర్ ముని శేఖర్ కలిసి పుష్పగుచ్చం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి గారు, తిరుపతి నగర పాలక సంస్థ ఉప మేయర్ భూమన అభినయ్ గారు,ప్రముఖ వైద్యులు హరిబాబు, హేమ కుమార్, రమేష్ తదితరులు ఉన్నారు.

గద్దర్ మృతికి ఏపీ పీఎన్ఎం సంతాపం

విశాలాంధ్ర - తిరుపతి: ప్రజా వాగ్గేయకారుడు గాయకుడు ప్రజా యుద్ధనౌక గద్దర్ మృతి కీ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య , దళిత డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మారెళ్ళ శ్రీనివాసులు, తిరుపతి జిల్లా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతా రవి , జింకా నాగరాజు మరియు ప్రజా సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు. ప్రజా వాగ్గేయ కారుడు ప్రజా యుద్ధ నౌక గద్దర్ తన పాట ఆటలతో ప్రజలను చైతన్య పరుస్తూ ప్రభుత్వాల గుండెల్లో రైళు పరిగెత్తించే విధంగా ఆయన పాట నడిచిందని అన్నారు. గద్దర్ పాటకు వేలాది మంది యువకులు ఆకర్షితులై ఎర్రజెండా అందుకొని సాయుధ పోరాటం లోకి సాగారని గుర్తు చేశారు. ప్రజా కళాకారుల కే కాకుండా ఎందరో సాహిత్య అభిమానులకు, సంగీత ప్రియులకు ఆయన పాట అందరినీ ఆకట్టు కున్నదని అలాంటి అత్యున్నతమైన ప్రజా పాటగా గుర్తింపు పొందిన గద్దర్ మృతి చెందడం ప్రజా ఉద్యమాలకు ప్రజా సాంస్కృతిక సంస్థలకు కళలకు తీరని లోటని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య అన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం మరియు వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మాతమ్మకు పట్టు వస్త్రాలను సమర్పించిన పులివర్తి నాని

విశాలాంధ్ర - రామచంద్రాపురం : మండలం రావిళ్ళ వారి పల్లె పంచాయతీ, బ్రాహ్మణ కాలువ ఆది ఆంధ్ర వాడ లో మాతమ్మ తల్లి తిరనాళ్లు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మాతమ్మ తల్లికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ముందుగా పులివర్తి నాని మంగళ వాయిద్యాలతో, హోరెత్తిన డప్పులు, బాణాసంచా మోతతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు ప్రత్యేక ఆహ్వానం పలికారు. అమ్మవారికి సారే సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆలయ పెద్దలు గ్రామస్తులు నాని తీర్థప్రసాదాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమల రెడ్డి,రావిళ్ళ గిరిబాబు, సీనియర్ నాయకులు చేకూరి జనార్దన్ చౌదరి, ఉమాపతి నాయుడు, కొట్టే గిరిధర్ రెడ్డి, గోపీ నాథ్ రెడ్డి,స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

ముక్కంటికి వెండి గిన్నె వితరణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో స్వామి అమ్మవార్ల అభిషేకం కోసం ఆదివారం విశాఖ పట్నంకు చెందిన రామ మూర్తి కుటుంబ సభ్యులతో కలసి సుమారు రూ.65వేలు విలువ చేసే 700 గ్రాముల వెండి గిన్నెను వితరణగా ఇచ్చారు. ఆలయ ధర్మ కర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఈ విరాళం స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు వీరికి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ తనిఖీదారు హరిబాబుయాదవ్,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిలయన్స్ ట్రెండ్స్ నూతన స్టోర్ ప్రారంభం

విశాలాంధ్ర - తిరుపతి : రిలయన్స్ ట్రెండ్స్ నూతన స్టోర్ ని తిరుపతి జిల్లాలోని తుడా రోడ్ ప్రాంతంలో తమ నాల్గొవ నూతన స్టోర్ ని ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిదులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈ స్టోర్ తిరుపతి ప్రాంతపు వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా, అందుబాటైన ధరలో మరియు తాము చెలించిన ధరకు అత్యధిక విలువని కలిగి ఉందన్నారు. ఈ పట్టణానికి చెందిన కస్టమర్లు సంతృప్తికరమైన ధరలకు ఆధునిక ఉమెన్స్ వేర్, మేన్స్ వేర్ కిడ్స్ వేర్ మరియు ఫ్యాషన్ యాక్ససరీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక మరియు గొప్ప షాపింగ్ అనుభవం ఉంటుందన్నారు. ప్రత్యేకమైన ప్రారంభోత్సవపు ఆఫర్ కింద రూ.3999 షాపింగ్ చేస్తే రూ.249 కి ఆకర్షనీయమైన బహుమతి పొందవచ్చన్నారు. అంతే కాదు రూ.3999 కొనుగోలు పై వినియోగదారులు రూ.2000 విలువగల కూపన్లు పూర్తి ఉచితంగా పొందగలుగుతారనీ వివారించారు.

గూడూరులో గుర్తుతెలియని మృతి

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని గమళ్లపాలెంలో గుర్తు తెలియని వృద్ధుని మృతదేహం ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఒకటవ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తుతెలియని మృత దేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ హజరత్ బాబు మాట్లాడుతూ మృతుని బంధువులు ఎవరైనా ఒకటవ పట్టణ పోలీసులను సంప్రదించాలని కోరారు.